క్లుప్తంగా

చుంచుపల్లి ఎంపీడీఓగా సుభాషిణి



చుంచుపల్లి: చుంచుపల్లి ఎంపీడీఓగా సీహెచ్ సుభాషిణి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు పనిచేసిన అశోక్ కుమార్ పదవీ విరమణ పొందగా ఆయన స్థానంలో సుభాషిణి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెను ఎంపీడీఓను కార్యాలయ ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు.

ఇల్లెందులో 88 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో ఉందని ఏరియా జీఎం వి.కృష్ణయ్య వెల్లడించారు. శనివారం ఇల్లెందులోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2025 జనవరి నెలలో సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతను ఏరియా వారి వివరాలను వెల్లడించారు. జనవరి నెలకు నిర్దేశించిన లక్ష్యం 4.30 లక్షల టన్నులకు గానూ 3.79 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తిని చేసి 88 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. జనవరి నెలలో 42 ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా చేశామని, ఇల్లెందు ఏరియాకు కేటాయించిన వార్షిక బొగ్గు లక్ష్యం 30.73 లక్షల టన్నులకు గానూ 36.81 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 120 శాతం నిలిచినట్లు తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని వెలికి తీయాలని, అందుకు ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ



పూజ నిర్వహిస్తున్న ఈఓ, భక్తులు

జూలూరుపాడు: పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి, శ్రీ రాధాకృష్ణుల విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి వెంకట్రావు, పాపకొల్లు భక్త బృందం ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మధుకుమార్ శంకుస్థాపన చేయించారు. ఈ భూమి పూజా కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరయ్యారు.

ఆలయానికి నేడు శంకుస్థాపన

సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయ ఆవరణలో పంచముఖ ఆంజనేయ స్వామి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 9 గంటలకు శంకుస్థాపన ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ బాధ్యులు కోరారు.

టీఎన్‌టీయూసీ అధ్యక్షుడికి సన్మానం



ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ విజయం సాధించడంపై అధ్యక్షుడు హరి ప్రసాద్‌ను టీడీపీ నాయకులు శనివారం కలిసి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నాకర్, ఓసీ అసోసియేషన్ జెన్‌కో సెక్రటరీ కట్టా శ్రీదర్, పోటు రంగారావు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



సమ్మె శిబిరంలో కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి పంచాయతీలో పని చేస్తున్న వర్కర్లు, సిబ్బందికి వేతనాలు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. శనివారం లక్ష్మీదేవిపల్లిలోని సమ్మె శిబిరంలో వారు మాట్లాడారు. పంచాయతీలు పట్టణానికి ఆనుకుని ఉండటంతో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు పంచాయతీ కార్మికులు విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారన్నారు. ఒక్కొక్కరికి గతంలో ఇచ్చిన మాదిరిగానే జీతాలు ఇవ్వాలని కోరారు.

మలుపు ఉంది జాగ్రత్త..

ప్రమాదాలకు నిలయంగా 'గూడెం' రహదారులు

- ప్రయాణమంటేనే వాహనదారుల బెంబేలు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయక ఇక్కట్లు





రుద్రంపూర్ పార్క్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



రుద్రంపూర్ జీఎం కార్యాలయం ఎదురుగా..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని పలు రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. అందులో మలుపుల వద్ద ఆదమరిస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా ఉంది. ఈ రోడ్లపై ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జనవరి 15న పట్టణ పరిధిలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల పెనగడప ప్రాంతంలోని మలుపువద్ద జరిగిన ప్రమాదంలో రెండు ఆటోలు ఢీ కొనగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆటో డ్రైవర్ మరణించారు. అదేనెల 5న రుద్రంపూర్ నుంచి కొత్తగూడెంకు బైక్‌పై వస్తున్న ముగ్గురు యువకులు కారును ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇలా ప్రమాదాలు జరుగుతుంటే అప్రమత్తం చేయాల్సిన అధికారులు పట్టించుకోట్లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

గండాలుగా మలుపులు..

రామవరం, రుద్రంపూర్, పెనగడప మార్గంలో, కొత్తగూడెం సబ్‌డివిజన్ పరిధిలోని వన్, టూ, త్రీ టౌన్ పోలీసుస్టేషన్ల పరిధిలోని జాతీయ రహదారుల అంతర్గత రోడ్ల వద్ద, రుద్రంపూర్‌లోని జీఎం కార్యాలయం వద్ద, రుద్రంపూర్ పార్క్ సమీపంలో, పాలిటెక్నిక్, ఐటీఐ సమీపంలోని బ్రిడ్జి వద్ద రామవరం 14 ఏరియా జంక్షన్ రోడ్డు, హెడ్డాఫీస్ సంత, రైటర్‌బస్తీ కిన్నెరస్టీల్‌లు సమీపంలో, సింగరేణి ప్రధానాస్పత్రి సమీపంలో ఉన్న మలుపులు ప్రాణాలకు గండాలుగా మారాయి. ఈ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సిగ్నళ్లు లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల్లో గాయాలపాలై మరణించిన సంఘటనలు ఉన్నాయి. రామవరం, త్రీఇంక్‌లైన్, జీఎం కార్యాలయం, పెనగడప ప్రాంతాల రోడ్లలో వీధి దీపాలను సైతం వెలగకపోవడం ప్రమాదాలకు మరొక కారణంగా మారింది. మలుపుల వద్ద ప్రధాన కూడళ్ల వద్ద డైవర్షన్‌లకు చెందిన బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలకు ప్రధాన కారణంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుని ప్రమాదాల నుండి రక్షించాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి...



రుద్రంపూర్ పార్కు మలుపు వద్ద తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు వీధి దీపాలు వెలిగేలా చూడాలి. స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– తోట రాజు, సీపీఐ నాయకుడు

ప్రయాణమంటేనే భయం..



రుద్రంపూర్, రామవరం, పెనగడప ప్రాంతాల గుండా రాత్రిళ్లు ప్రయాణించాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. మలుపులు మరింతగా ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– జెట్టి మోహన్, కాంగ్రెస్ నాయకుడు

చర్యలు చేపడుతున్నాం..



అన్ని శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు అవగాహన కలిగిస్తున్నాం. రోడ్లకు ఇరువైపుల ట్రాఫిక్ నియమాలను, స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేస్తాం.

– అబ్దుల్ రెహమాన్, డీఎస్పీ, కొత్తగూడెం

క్షయ నిర్మూలనే లక్ష్యం..



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

టేకులపల్లి: క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ దానిపై పూర్తి అవగాహన ఉండాలని వైద్యాధికారులు కంచర్ల వెంకటేష్, గోపిలాల్, మహమ్మద్ సుమయ అన్నారు. నిక్షయ్ షివిర్ కార్యక్రమంలో భాగంగా శనివారం కోయగూడెం ఆశ్రమ పాఠశాల , ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. చాప కింద నీరులా వ్యాపిస్తూ అనేక మందిని కబళించే అవకాశం ఉందని ఒక్క వ్యాధిగ్రస్తుడు 15 మంది ఆరోగ్యవంతులకు ఈ వ్యాధిని అంటిస్తాడన్నారు. క్షయపై సంపూర్ణ అవగాహన పెంచుకొని తరమివేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వజ్జా పార్వతి, దేవా, శంకర్, ధరణి, నాగుబండి వెంకటేశ్వర్లు, సునీత, రమాకుమారి, వెంకటరమణ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఈ నెల 5న సూర్యాపేటలో నిర్వహించనున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విలీన మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సమాఖ్య ప్రతినిధులు శనివారం మండలంలోని ఎల్లాపురం గ్రామంలో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి యనగంటి చిరంజీవి మాట్లాడుతూ.. అభిప్రాయ భేదంతో విడిపోయిన సమాఖ్య తిరిగి ఒక్కటవుతోందని, తద్వారా ప్రజా చైతన్య కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. జోగ కాంతారావు, రామనాథం, విజయ్, పాషా, నరసయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: అటవీశాఖకు చెందిన సర్వే నంబర్ 603ను రెవెన్యూ భూమిగా మార్చాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని ఇందిరానగర్‌లో శనివారం సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు అబ్దుల్ నబి, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మాట్లాడుతూ.. 1976లోనే బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన నిధులతో 350 ఇండ్లు నిర్మించి ఆ ప్రాంతానికి వడ్డెర కాలనీగా నామకరణం చేశారని, 1985లో సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం ఉద్యమాలు నిర్వహించి 250 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేయించి ఆ ప్రాంతానికి సుందరయ్యనగర్‌గా నామకరణం చేశారని గుర్తుచేశారు. ఇలా ఏర్పడిన కాలనీలతోపాటు సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న వారితో ఇందిరానగర్ ఏర్పడిందని వివరించారు. కానీ నేటికీ ఈ ప్రాంత భూభాగాన్ని అటవీశాఖ పరిధిలో ఉందని చెబుతూ ఇంటి నిర్మాణానికి, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అవరోధంగా ఉందని సాకుగా చూపడం సరైందికాదన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, కొడెం బోస్, అబ్బాస్, సోమకృష్ణ, వజ్జ సురేష్, పుష్ప ఉన్నారు.

నేడు పంచాయతీ కార్మికుల సభ



మాట్లాడుతున్న వెంకన్న

ఇల్లెందురూరల్: పాల్వంచలో ఆదివారం నిర్వహిస్తున్న టీయూసీఐ అనుబంధ పంచాయతీ కార్మికుల మహాసభను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పాయం వెంకన్న, లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండలంలోని పలు గ్రామపంచాయతీలలో విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో ఈ జీఓను అమలు చేస్తున్న ప్రభుత్వం పంచాయతీల్లో అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తోందన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికుల హక్కులు, వేతనాల విషయంలో మోసం చేసి ఓటమి పాలయ్యిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గోపి, కమల, రాంచంద్, రాజాలు, పెద్దులు, వీరస్వామి, రమేష్, చిట్టిబాబు, సోనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సంఘం క్యాలెండర్లు..



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. కమ్మ మహాజన సంఘం నాయకులు గంగవరపు రామకృష్ణ ప్రసాద్, కండెపునేని రత్నాకర్‌రావు, ధనియాకుల రాంబాబు, శాగంటి కృష్ణమూర్తి, నామా సుధాకర్, రవీందర్, ఆళ్ల నాగేశ్వరరావు, రమేష్, వేణు, సత్యనారాయణ, నేలవేని నర్సింహారావు ఉన్నారు.

రోడ్డు పనుల అడ్డగింత



మట్టిని చూపిస్తున్న గ్రామస్తులు

సుజాతనగర్: మండలంలోని సీతంపేట బంజర గ్రామంలోని చర్చి సమీపంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కొందరు గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... కంకర వేయకుండానే మట్టిపైనే రోడ్డును వేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ధారావత్ శ్రీను, రాంబాబు, వి.శ్రీను, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు గట్టుపై తెల్ల తివాచీలా..



చెరువు గట్టుపై తెల్లటి తివాచీ పరిచినట్లుగా కొంగలన్నీ ఒక చోటుకు చేరాయి. దీంతో ఆ ప్రాంతం తెలుపువర్ణంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. ఇల్లెందు మండలంలోని పోలారం పెద్దచెరువు అంచున శనివారం ఈ దృశ్యం చూపరులను కట్టిపడేయగా పలువురు సెల్ఫీలు దిగారు.

– ఇల్లెందురూరల్

ఎమ్మెల్యే విస్తృత పర్యటన



బచ్చలకోయగూడెంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ విస్తృతంగా పర్యటించారు. గుండెపుడి యల్లంకి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏన్కూర్ మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బాదావత్ బుజి, బాలాజీ దంపతుల కుమారుడు వివాహ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పాపకొల్లు, ముత్యాలమ్మకాలనీ, భీమ్లాతండా, బచ్చలకోయగూడెం, జడలచింత, పెద్దహరిజనవాడ, వెంగన్నపాలెం గ్రామాల్లోని పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, రాంశెట్టి రాంబాబు, నున్నా కృష్ణయ్య, కొలిపాక వెంకటేశ్వర్లు, కొదుమూరి కోటేశ్వరరావు, రాంశెట్టి నాగేశ్వరరావు, ధర్మరాజుల వెంకటనారాయణ, బానోత్ నవీన్, వేల్పుల నరసింహారావు, పాపిన్ని జనార్ధన్, గోపు రామక్రిష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బానోత్ స్వాతి పాల్గొన్నారు.

అయిలయ్య మృతి తీరని లోటు



పరామర్శిస్తున్న వీరభద్రం

సుజాతనగర్: సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య కుటుంబాన్ని పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం శనివారం పరామర్శించారు. ఈ మేరకు కాసాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయిలయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. అయిలయ్య కుటుంబానికి పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయనతోపాటు నాయకులు అన్నవరపు కనకయ్య, పోతినేని సుదర్శన్, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, వీర్ల రమేష్, కాట్రాల తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

బాడీ లారీలకు బొగ్గు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో రెండేళ్ల నుంచి బాడీ లారీలకు బొగ్గు సరఫరా చేయకపోవడంతో ఏరియాలో 72 మంది కాంటా కార్మికులు ఆకలితో అలమటిస్తురని, తక్షణమే వారికి బొగ్గు సరఫరా చేయాలని ఏఐటీయూసీ, టీయూసీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఇల్లెందు ఏరియా జీఎం వి.కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా నాయకులు ఎండీ.నజీర్ అహ్మద్, యాకుబ్‌షావలీలు మాట్లాడుతూ... బాడీలారీలకు బొగ్గు లేకపోవటంతో కార్మికులతో పాటు కోల్ ట్రాన్స్‌పోర్టు గుమస్తాలు డ్రైవర్లు ఉపాధి లేక అడ్డామీద కూలీలుగా మారుతున్నారన్నారు. జీఎం జోక్యం చేసుకుని బాడీ లారీలకు బొగ్గు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, వెంకన్న, కొమరయ్య, యాకుబ్‌పాషా, కృష్ణ, సైదులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను అరికట్టాలి



మాట్లాడుతున్న రమేష్

ఇల్లెందు: మత్తు పదార్థాల వల్ల యువత చెడు మార్గం పడుతోందని, వెంటనే వాటిని అరికట్టాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ అన్నారు. శనివారం ఇల్లెందు ఎన్డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీవైఎల్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లోనూ డ్రగ్స్, గంజాయి, కొకైన్ లాంటి మాధకద్రవ్యాలు లభించటంతో యువత వాటికి బానిసలుగా మారుతున్నారన్నారు. అధికారులు దృష్టి సారించి మత్తు పదార్థాలను లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహరావు, రవి, మోతీలాల్, భానుచందర్, కృష్ణ, ఉపేందర్, రవి, లాజర్, సాదనపల్లి రవి, రామకృష్ణ, సమ్మయ్య నాయకులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

పాల్వంచ: దాడి ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఐదుగురిపై కేసు నమోదైంది. ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మంచికంటినగర్‌కు చెందిన ముద్దంగుల రవి, చిట్టిబాబు, పల్లపు చందులను అదే నగర్‌కు చెందిన జగన్, శాంతికుమార్, నవీన్, రాహుల్, సునీల్ మద్యం తాగేందుకు డబ్బులు అడగగా వారు ఇవ్వలేదు. దీని దృష్టిలో ఉంచుకుని శుక్రవారం రవి, చిట్టిబాబు, చందులపై ఆ ఐదుగురు దాడి చేయగా వారికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఘనంగా స్పోర్ట్స్ డే

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం సెయింట్ ఆంటోనియస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ వి.నరేష్, ఎంఈఓ బానోత్ జంకీలాల్‌లు హాజరయ్యారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ ఆల్‌ఫెన్సో, ప్రిన్సిపాల్ ఆరతి, పీఈటీ నాగేశ్వరరావు, వెంగన్నపాలెం సెక్రటరీ లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి మరో వైద్యుడు

ఇల్లెందు: ఇల్లెందులోని 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో మరో వైద్యుడు అందుబాటులోకి వచ్చారు. ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఎండీ (జనరల్ మెడిసిన్) జి.శేఖర్ ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వర్తించాలని నిర్ణయించుకుని ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. ఈనేపథ్యాన ఇల్లెందు ఆస్పత్రిని ఎంచుకున్న ఆయన శనివారం విధుల్లో చేరగా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.రవిబాబు, సూపరింటెండెంట్ హర్షవర్ధన్ అభినందించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

జూలూరుపాడు: ఈనెల 5, 6వ తేదీల్లో పాల్వంచ పట్టణంలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పి.పవన్ అన్నారు. శనివారం మండలంలోని పలు పాఠశాలలో జిల్లా మహాసభల కరపత్రాలను విద్యార్థులతో కలిసి నాయకులు ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి సంఘం అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. సాయి, కిరణ్, చరణ్, హర్ష, నందిని, అఖిల పాల్గొన్నారు.

బ్రహ్మానందంగా కొంటూరని..!



వస్త్ర దుకాణంలో ఏర్పాటు చేసిన బ్రహ్మానందం ఫొటో

కొత్తగూడెంఅర్బన్: వస్త్ర దుకాణాలలో ఆకర్షణీయంగా కనిపించేందుకు సినిమా హీరోలు, హీరోయిన్ల చిత్రపటాలను సహజంగా ఏర్పాటు చేసుకుంటారు. లేకుంటే భక్తితో దేవుడి చిత్రపటాలను ఏర్పాటు చేస్తారు. కానీ కొత్తగూడెం పట్టణ పరిధి సూపర్‌బజార్ సెంటర్‌లోని ఎంకేఏ వస్త్ర దుకాణంలో భిన్నంగా ఏర్పాటుచేసి హాస్యనటుడు బ్రహ్మానందం చిత్రపటం అందరినీ ఆకర్షిస్తోంది. బ్రహ్మానందంపై ఉన్న అమితమైన అభిమానంతో ఆయన ఫొటో షాపులో ఎప్పుడు కనిపించే విధంగా ఏర్పాటుచేసినట్టు షాపు యజమాని వివరించారు. అదేవిధంగా శనివారం బ్రహ్మానందం పుట్టిన రోజు కావడం విశేషం.